క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆలూరు: అవార్డులను అందుకున్న తర్వాత తమ బాధ్యత మరింత పెరిగిందని ఉత్తమ ఉపాధ్యాయులు సి.నరసింహులు,మంజులమ్మ అన్నారు. బుధవారం స్థానిక మెయిన్ పాఠశాల ఆవరణలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి నాగరాజ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. వివిధ పాఠశాలల హెచ్ఎంలు, రిటైర్డు ఎంఈఓలు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



పేట్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఉమాదేవి

మద్దికెర: ప్రభుత్వం అందజేసే సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో వక్క బెరడుతో తయారు చేసే పేట్ల యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు రుణాలతో స్వంతంగా యూనిట్లు పెట్టుకొని మరింత మందికి ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా ఎదిగాలని చెప్పారు. మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం మధు ఉన్నారు.

దేవనకొండ సీఐగా గిరిబాబు



దేవనకొండ: నూతన సీఐగా గిరిబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు హెడ్ క్వార్టర్స్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

డ్రైనేజీల నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఓ శివకుమార్

మద్దికెర : స్థానిక ప్రధాన బస్టాండు నుంచి పందుల కుంట వరకు చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని ఈఓ శివకుమార్, సర్పంచ్ బండారు సుహాసిని సూచించారు. బుధవారం పనులను పరిశీలించారు. వర్షాలు వచ్చినపుడు బస్టాండు వద్ద నీరు ఎక్కువ రోజులు నిలిచిపోయి వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతుండడంతో పనులు చేపట్టామన్నారు.

పొలాలకు దారి ఇప్పించండి

చిప్పగిరి: మా పొలాలకు దారి ఇప్పించాలని నగరడోణ గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని 265,266,270 తదితర సర్వే నంబర్లలోని పొలాలకు వెళ్లడానికి నెలకొన్న దారి సమస్యలను వివరించారు. లక్ష్మికాంత్ రెడ్డి,విశ్వనాథ్ రెడ్డి,చంద్ర రెడ్డి,వెంకటరాముడు,రాము,ఖాజా ఉశేని పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో 'గులాబీ' నివారణ



రైతులకు లింగాకర్షణ బుట్టలను పంపిణీ చేస్తున్న జేడీ

గోనెగండ్ల: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలే మేలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హెచ్.కై రవాడి గ్రామంలో 20 ఎకరాల్లో నిర్వహించిన పత్తి పంట ప్రదర్శన క్షేత్రంలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగాకర్షక ఎర బుట్టలను ఏడీ మహమ్మద్ ఖాద్రీతో కలిసి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు రైతులందరు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 15లోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీటీఎం చక్రవర్తి నాయక్, ఏఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వసతి గృహాలు

- హాస్టళ్లలో మౌలిక వసతులు కరువు
- డైనింగ్ హాల్, మినరల్ వాటర్ ప్లాంట్లు లేక విద్యార్థుల అవస్థలు
- డ్రైనేజీలు లేక లోపించిన పారిశుద్ధ్యం
- కిటికీల అద్దాలు ధ్వంసం
- ఇరుకు గదుల్లో చిన్నారుల ఇబ్బందులు



ఇంగదహాళ్‌లోని బీసీ సంక్షేమ వసతి గృహంలో ఇరుకు గదిలో పడుకున్న విద్యార్థులు



ఆలూరు సమీకృత హాస్టల్‌లో చెడిపోయిన మినరల్ వాటర్ ప్లాంట్

ఆలూరు: వారంతా నిరుపేద విద్యార్థులు.. చదువుకోవాలని హాస్టళ్లలో చేరితే కనీస వసతులు లేక అష్ట కష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసి మినరల్ వాటర్ ప్లాంట్లు చెడిపోయినా ప్రస్తుతం మరమ్మతులు చేయించలేకపోవడంతో బోరు నీటిని తాగుతున్నారు. గదుల కొరత, మరుగుదొడ్లు శిథిలమై, డ్రైనేజీ ముందుకు కదలక దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇక గదుల పైకప్పులు పెచ్చులాడి పడుతుండటంతో నిత్యం భయాందోళనలో గడుపుతున్నారు.

ఆలూరులో..

- సమీకృత వసతి గృహంలో 250మంది విద్యార్థులు ఉన్నారు.
- గదులపై కప్పు నుంచి సిమెంట్ పెచ్చులూడి పడుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.
- కిటికీలకు జాలీ అమర్చకపోవడం వల్ల దోమల బెడద ఎక్కువ కావడంతో సూపర్ పట్టాలను అడ్డంగా కట్టుకున్నారు.
- డ్రైనేజీ వ్యవస్థ లోపించింది.
- మినరల్ ప్లాంట్ చెడిపోవడంతో ఉప్పు నీటిని తాగుతున్నారు
- డ్రైనేజీ సదుపాయం లేక వసతి గృహం వెనుక భాగంలో మురుగు నిలిచిపోవడంతో పందులు, కుక్కలకు ఆవాసంగా మారింది. మురుగుతో దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

అరికెర గురుకుల బాలుర అంబేడ్కర్ పాఠశాలలో..

- 589 మంది విద్యార్థులున్న పాఠశాలకు ప్రహరీ లేదు. దీంతో విషపురుగులు వసతి గృహం ఆవరణంలోకి వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- మిరల్ వాటర్ ప్లాంట్ చెడి పోయినందువల్ల బోరు నీటిని తాగుతున్నారు. ఆలూరు గిరిజన గురుకుల పాఠశాలవిద్యార్థునులకు 290 మందికి గదుల కొరత, డ్రైనేజీ తదితర సమస్యలు వేధిస్తున్నాయి.
- ఇంగదహాళ్ గ్రామంలోని బీసీ వసతి గృహంలో 13 గదులు ఉండగా 11 గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.
- 140 మంది విద్యార్థులకు పడుకునేందుకు గదుల కొరకారణంగా సమీపంలోని దేవాలయంలో నిద్రిస్తున్నారు.
- ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి ,కస్తూర్బా పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సమస్య మరుగుదొడ్ల సమస్యలు విద్యార్థినులను వేధిస్తున్నాయి.
- ఆలూరులోని ఎస్సీ బాలికలు, తెర్నెకల్ గ్రామంలోని బీసీ బాలికల వసతి గృహాల్లో డ్రైనేజీ సదుపాయం లేదు.

నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రైవేటు వ్యక్తులతో వసతి గృహాలను శుభ్రం చేయిస్తున్నామని హెచ్‌డబ్ల్యూఓలు పేర్కొంటున్నారు.



దేవనకొండలో కస్తూర్బాలో ఇరుకుగా కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థినులు



ఆస్పరి కస్తూర్బాలో డైనింగ్ హాల్ లేకపోవడంతో వరండాలో భోజనం చేస్తున్న విద్యార్థినులు



చిన్నహోతూరు బీసీ బాలుర వసతి గృహంలో కుళాయిల వద్ద సంప్‌పై కాలకృత్యాలు తీసుకుంటున్న విద్యార్థులు

రేపు ఆరాధనోత్సవం

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో ఈనెల 13వ తేదీన దక్షణమూర్తి స్వామి 32వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు బుధవారం గ్రామ పెద్దలు తెలిపారు. 13న స్వామి వారికి గంగపూజ, సద్గురు సమాధికి పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

జిల్లా స్థాయి భజన పోటీలు..

ఆరాధనోత్సవాల సందర్భంగా 13న జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా.. రూ.15,116, రూ.12,116, రూ.9,116, రూ.7,116, రూ.6,116, నుంచి రూ.1,016 వరకు ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ. 300 చెల్లించాలన్నారు. వివరాలకు సెల్: 8790242809, 8074508537 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వంద శాతం పంట నమోదుకు చర్యలు

కృష్ణగిరి: ఖరీఫ్ పంట నమోదు వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి తదితర గ్రామాల్లో పంట నమోదును బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదుకు నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని, ఈ విషయాన్ని రైతులు గుర్తించి నమోదుకు సహకరించాలన్నారు. మండలంలో 59,292 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇప్పటి వరకు 55,095 ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. 93 శాతం నమోదు పూర్తి కాగా ఇందులో వీఏఏ ఈ-కేవైసీ 95.76 శాతం పూర్తి కాగా.. వీఆర్వో ఈ-కేవైసీ కూడా 78 శాతం పూర్తయిందని చెప్పారు. కానీ ఫార్మర్ ఈ-కేవైసీ కేవలం 21 శాతం మాత్రమే అయ్యిందన్నారు. దీన్ని కూడా ఈ నెల 15లోగా వందశాతం పూర్తి చేసేలా వీఆర్వోలు, వీఏఏలు కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరుపాక్షి

ఆలూరు: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, వారి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిద్దామని ఎమ్మెల్యే బి.విరూపాక్షి సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల కో- కన్వీనర్ అరికెర వీరేష్ ఆధ్వర్యంలో పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు,వివిధ గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుందని, నిధుల సాకుతో హామీల అమలును అటకెక్కించారన్నారు. సంక్షేమ పథకాలు అందక రైతులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్యాలెండర్ ప్రకారం పథకాలు అందజేసి ప్రజలను ఆదుకున్నారని గుర్తు చేశారు. కూటమి నాయకుల కుట్ర కారణంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేదని, ఎవరూ నిరాశ నిస్పృహలకు గురి కావాలసిన అవరం లేదన్నారు. తాను అండగా నిలుస్తానని భరోసానిచ్చారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చేందుకు సూపర్ 6 పథకాల పేరుతో అధికారాన్ని చేజిక్కించుకుని ఇప్పటి వరకు అమలు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. అధికార అహంకారంతో ఆయా పార్టీల నాయకులు చేస్తున్న వికృత చేష్టలను ప్రజలకు వివరించాలని, ఇందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకుడు రిటైర్డు తహసీల్దార్ బీసీ మాదన్న, మరకట్టు ఎల్లప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, శివ,బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగేంద్ర, హత్తిబెగళ్ సర్పంచ్ షేకుంబీ, మౌళా, రామాంజనేయులు, మల్లికార్జున, ఉరుకుందు,ఎస్కే గిరి, కురుబ హనుమంతప్ప,డ్రైవర్ భాషా, నిత్రవట్టి తిమ్మప్ప వరుణ్ ,రాజు ఉన్నారు.

రాజకీయాలు మానండి..

బోట్లు, బొంకు రాజకీయాలను సీఎం చంద్రబాబునాయుడు మాని వరద బాధిత కుంటుబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి సూచించారు. ఆయన నిర్లక్ష్యం కారణంగా.. వరదల్లో 60 మంది వరకు ప్రజలు ప్రాణాలు పోవడానికి కారణమయ్యారన్నారు. బోట్లు టీడీపీ సానుభూతిపరులవేనన్నారు. నిందితులు టీడీపీ నాయకులతో ఫొటోలు దిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టీబీ డ్యాం గేట్లు మొత్తం మార్చాలని, నేషనల్‌సేఫ్టీ డ్యాం అథారిటీ కమిటీ నివేదిక అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



షేక్ శాలుమియ్యాను పరామర్శిస్తున్న కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఆధైర్య పడాల్సిన అవరసం లేదని, అండగా ఉంటామని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. కృష్ణగిరికి చెందిన మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ శాలుమియ్యా భార్య ఫాతిమాబీ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయిస్తోందని, అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, హుసేన్‌సాహెబ్, నారాయణ, సుంకన్న, రంగనాయకులు ఉన్నారు.

దేవరగట్టు హుండీ సొమ్ము లెక్కింపు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయ హుండీ సొమ్ము లెక్కించినట్లు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులు హుండీ సొమ్మును లెక్కించారు. మొత్తం రూ.2.60 లక్షల నగదుతో పాటు రెండు వెండి గుర్రాలు, రెండు మీసాలు, 5 కళ్లు, చిన్న బంగారు ఉంగరం లభించిందని చెప్పారు.

కానుకలను తీసుకెళ్లిన మరో వర్గం..

ఆలయ ప్రధాన హుండీని మినహా మిగిలిన రెండు హుండీల్లోని కానుకలను నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన కొందరు తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరుడు, ఆలయ కమిటీ సభ్యులు ఆరోపించారు. కమిటీ సభ్యులతో కలిసి తాము హుండీ లెక్కింపునకు వస్తున్నామనే సమాచారంతో మిగిలిన సింహాసన కట్ట, సత్యనారాయణ కట్ట వద్ద ఉన్న రెండు హుండీలను తెరిచి అందులోని కానుకలను తీసుకెళ్లి పోయారని చెప్పారు.

విరాళాల సేకరణ



పి.రామచంద్రయ్యకు విరాళాల మొత్తాన్ని అందజేస్తున్న దృశ్యం

దేవనకొండ: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సేకరించిన విరాళాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథంకు సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవాంర అందజేశారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శులు రాజశేఖర్, కృష్ణ, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో వివిధ వర్గాల ప్రజల నుంచి సేకరించిన మొత్తం రూ.11,209ను ఏపీ సీఎం సహాయ నిధికి పంపుతున్నట్లు చెప్పారు. రామాంజనేయులు, వీరాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలి

చిప్పగిరి: పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 15వ తేదీ లోపు ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని చెప్పారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కృష్ణగిరి: వెల్దుర్తి సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ మధుసూదన్‌రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గస్తీ పెంచి అక్రమ మద్యం, పేకాట తదితర వాటిపై నిఘా పెంచుతామన్నారు. సమస్యలున్న వారు నేరుగా స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని, దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు నిఘా కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వరద బాధితులకు విరాళం



కమ్మరచేడులోనిత్యావసర సరుకులను వాహనంలో పంపుతున్న శ్రీరామకమిటీ సభ్యులు

ఆలూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో భాగంగా కమ్మరచేడు గ్రామానికి చెందిన శ్రీ రామ కమిటీ సభ్యులు బుధవారం విరాళాలను సేకరించారు. 5 కేజీల బియ్యం,1కేజీ కందిబేడలు, కారం ,ఉప్పు, చింతపండు, తదితర నిత్యావసరాలను ప్రత్యేకంగా ప్యాకింగ్ చేయించారు. ఇలా 370మంది సరిపడ ప్యాకెట్లను ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపారు.

దేవనకొండ: విజయవాడ వరద బాధితులకు 70 శాతం నిత్యావసర సరుకులు, 30 శాతం నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేసినట్లు ఎన్‌డీయూ కూటమి నాయకులు బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం నగదు రూ.4,94,700 వచ్చిందన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : వరదలతో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ ముందురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ బృందం పట్టణంలోని వస్త్ర దుకాణదారుల నుంచి వస్త్రాలు సేకరించారు. రాజా సాహెబ్, రామాంజనేయులు, కారుమంచి, కారన్న పాల్గొన్నారు.

హాలహర్వి: మాచనూరు గ్రామ ఎంపీపీ స్కూల్ విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం తమవంతుగా రూ.3 వేలు పోగుచేసి అందించారని హెచ్ఎం సోమప్ప తెలిపారు.

మద్దికెర : విజయవాడలో సృష్టించిన వరద బీభత్సం వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం మన ధర్మమని, ఆపద్బంధు సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులు విరాళాలు అందజేశారు. ప్రత్యేక అధికారి జ్యోతి, సమితి సభ్యులు హరి పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలి



ధర్నాలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

పత్తికొండ(తుగ్గలి) : ఆర్టీఏ కార్యాలయాల్లోనే వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పిన ఆటోమెటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ సిస్టం ద్వారా లైసెన్స్‌లు జారీ చేసే విధానాన్ని నిరసిస్తూ బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వాహన డ్రైవర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ యాక్ట్ సవరణ చట్టం బిల్లులో భాగంగా వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీని ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. టెస్టింట్ ట్రాక్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫిట్‌నెస్ ట్రాక్‌లను రద్దు చేయాలని తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు తెలిపారు.

ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దు..

ఆస్పరి: డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్‌లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని డిమాండ్ చేస్తూ బుధవారం ఆస్పరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ యాక్ట్ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ గాయత్రీకి వినతి పత్రం అందజేశారు. రామాంజిని, మాణిక్యప్ప, రవి, కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నివాళి

హాలహర్వి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త అంచే సుంకన్న (49) గుండెపోటుకు గురై బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు రామిరెడ్డి, మండల కో-కన్వీనర్ మల్లికార్జున తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి: ప్రభుత్వం వైద్యుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రఘురామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, దుర్గాబాయి కోరారు. జీఓ నంబర్. 85కు వ్యతిరేకంగా బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు నిరసన కొనసాగిస్తామని చెప్పారు.

జోగుళాంబ హాల్ట్ తాత్కాలికంగా రద్దు

కర్నూలు కల్చరల్: రైల్వే ప్లాట్‌ఫారం పనుల కారణంగా కొన్ని రైళ్లకు శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగుళాంబ రైల్వేస్టేషన్ వద్ద హాల్ట్ (నిలపడం) తాత్కాలికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు హాల్ట్ ఉండదని పేర్కొన్నారు. కాచిగూడ-గుంటూరు, హంద్రీ ఎక్స్‌ప్రెస్, గుంతకల్-బోదన్, ఔరంగబాద్-గుంటూరు, తుంగభద్ర ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-గుంతకల్ రైళ్లు జోగుళాంబ స్టేషన్‌లో ఆగవని వెల్లడించారు.

రైతులను ఆదుకోవాలి

దేవనకొండ: అతివృష్టి వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు మహాసభ సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 15 రోజులుగా వర్షాల వల్ల రైతులు వేసిన అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ధర్మ, రాము, కండోజి, యేసేపు, నాగరాజు, చిన్నా పాల్గొన్నారు.

అధ్వానం.. ఎల్లార్తి రోడ్డు



గుంతలు పడి అధ్వానంగా మారిన హొళగుంద-చిన్నహ్యాట గ్రామాల మధ్య రోడ్డు



హొళగుంద: హొళగుంద-ఆలూరు వయా ఎల్లార్తి పంచాయతీరాజ్ రోడ్డులోని హొళగుంద నుంచి చిన్నహ్యాట వరకు ఉన్న 5 కి.మీ రోడ్డు అధ్వానంగా మారింది. గతంలో ఆలూరు వయా ఎల్లార్తి మీదుగా కంకర, ఇతర లోడులతో భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు ధ్వంసమైంది. ఇటీవల కురిసన వర్షాలకు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. వాహనాలు గుంతలను దాటి ముందుకెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు భారీగా తరలివస్తుంటారు. రోడ్డు శిథిలమవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ విద్యను కాపాడుదాం



ర్యాలీలో మాట్లాడుతున్న సోమన్న

వెల్దుర్తి: ప్రభుత్వ విద్యను కాపాడుకోవడానికి, విద్య ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి విద్యార్థులు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. సోమన్న పిలుపునిచ్చారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ మండల మూడవ మహాసభను ఘనంగా నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి జూనియర్ కాలేజీ చేరుకుని విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణతో కలిసి ఆయన మట్లాడుతూ వెల్దుర్తి మండలంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు, ఇంటర్మీడియెట్‌లో మధ్యాహ్న భోజన వసతి కల్పించేలా పోరాడదామన్నారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షుడిగా సదానంద, ఉపాధ్యాక్షులుగా వెంకటేశ్, రాజేంద్ర, చరణ్, ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర యాదవ్, సహాయ కార్యదర్శులు, కోశాధికారులుగా అశోక్‌కుమార్, ఇర్ఫాన్, వరుణ్, మోహన్ ఎన్నికయ్యారు. మహిళా కమిటీ మండల కన్వీనర్‌గా గౌతమి, కో కన్వీనర్లుగా గీతాంజలి, మమత, పెద్ద జయమ్మ, చిన్న జయమ్మ ఎన్నికయ్యారు.

నాడు దాహం తీర్చింది..



జొన్నగిరిలో చెత్తచెదారంతో నిండిపోయిన పురాతన బావి

కొన్నేళ్ల క్రితం వరకు జొన్నగిరి వాసుల ప్రధాన నీటి వనరు ఆ దిగుడు బావి. గ్రామస్తుల దాహార్తి తీర్చింది. ప్రస్తుతం పట్టించుకోకపోవడం, నీటిని వినియోగించకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి, చెత్త చెదారంతో నిండిపోయింది. పరిసరాల్లో ఉండే వారు చెత్తను వేస్తుండటంతో బావి పూడిపోతోంది. చెత్తచెదారంతో నిండిపోవడంతో కొందరు ఆ నీటిని వాడుకోవాలనుకున్నా సాధ్యం కావడం లేదు. అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించి బావిని శుభ్రం చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు. బావి వినియోగంలోకి వస్తే వేసవిలో నీటి ఎద్దడి తప్పుతుందని చెబుతున్నారు. - తుగ్గలి